క్లుప్తంగా

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు రాయితీపై విత్తనాలు అందజేస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు. రాయితీపై రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నామన్నారు. వాడ్రాపల్లి రైతు భరోసా కేంద్రంలో ఆయన సోమవారం రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా అమలు చేయడంతో పాటు రైతులకు మరిన్ని సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏ తులసి, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మునగపాకలో జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

మునగపాక : మునగపాక సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరంలో నిష్ణాతులైన పలువురు వైద్యులు వైద్య సేవలందించడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రసాద్ కోరారు.

సైబర్ మోసాలకు గురి కావద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. తిమ్మరాజుపేటలో సోమవారం సైబర్ నేరాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజలను అమాయకులను చేసి కొంతమంది నేరగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతుంటారన్నారు. బ్యాంకు ఖాతా నంబర్లు, ఓటీపీల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, వార్డు సభ్యుడు జగన్‌మోహన్‌రావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కంటి రోగులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మేలు జరుగతుందని తిమ్మరాజుపేట సర్పంచ్ భీశెట్టి మంగవేణి కృష్ణారావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించుకున్న రోగులకు సోమవారం సచివాలయంలో కళ్ల జోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందన్నారు. కంటిరోగులకు ఉచితంగా పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, గృహ సారధి రాము, ఏఎన్ఎం ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక నేడు

కోటవురట్ల : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి మండలంలో 2023–24 సంవత్సరంలో చేపట్టిన పనులు, నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. ఈజీఎస్, సెర్ప్, హౌసింగ్, పీఆర్, వెటర్నరీ, ఫారెస్టు, ఆర్‌డబ్ల్యుఎస్, సర్వశిక్షా అభియాన్ విభాగాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేసిన నిధులపై సామాజిక తనిఖీ పూర్తయిందని, తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజావేదిక ఉంటుందని తెలిపారు. కూలీలు, రైతులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

10న గౌరీపరమేశ్వరుల ఉత్సవం

కశింకోట : కశింకోటలో ప్రసిద్ధి చెందిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 10న జరగనుంది. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగే ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. దీనిలో భాగంగా స్థానిక పంచాయతీ ప్రధాన రహదారి పొడవునా విద్యుద్దీపాలంకరణ పనులు నిర్వహిస్తున్నారు. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం



తులసీనగర్ సచివాలయంలో మహిళకు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న కమిషనర్ కొండలరావు



రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సూర్యనారాయణ

- ఆస్తిపై సంపూర్ణ హక్కు కల్పిస్తున్న ప్రభుత్వం

యలమంచిలి రూరల్ : పేదల ఇళ్ల పట్టాలకు జగన్ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కు కల్పిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన ఈ ప్రక్రియ సోమవారం యలమంచిలి మున్సిపాలిటీలో ప్రారంభమైంది. తులసీనగర్ సచివాలయంలో ఈ కార్యక్రమాన్ని కమిషనర్ కొండలరావు ప్రారంభించి లబ్ధిదారులకు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు సీఎం జగనన్న మమ్మల్ని ఆస్తికి యజమానులను చేసిన దేవుడని కొనియాడారు. పేదలకు ఆస్తిపై సంపూర్ణ హక్కు కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటామని మొదటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న చింతలపాటి శ్రీదేవి అన్నారు. అనంతరం బుద్దా భవానీ, ఆడారి మహాలక్ష్మి తదితరులకు కూడా సచివాలయ సిబ్బంది వారి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో 850 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిందని వారందరి స్థలాలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు ఎలాంటి షరతులు విధించకుండా భవిష్యత్తులో వారికి ఇబ్బందులు తలెత్తకుండా వారికి సంపూర్ణ హక్కు కల్పిస్తోందని కమిషనర్ కొండలరావు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

పాయకరావుపేట : జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం మండలంలో అధికారులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. మండలంలో గల 24 గ్రామ పంచాయతీల పరిధిలోను ఇళ్ల స్థలాలు లేని పేదలకు 2952 మందికి జగనన్న ఇళ్ల పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసింది. మండలంలో 24 గ్రామాల పరిధిలో 90 ఎకరాల్లో 18 లేఅవుట్లను వేసి, ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు కేటాయించారు. ఆయా గ్రామాల పరిధిలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. ఇళ్ల స్థలాలు పట్టాలు పొందిన వారందరికీ ఆయా గ్రామాల్లో గల సచివాలయాల్లో పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఆయా సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షణలో గ్రామ సచివాలయ సిబ్బంది పట్టాలు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ఒకటో నెంబరు గ్రామ సచివాలయంలో పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ జి.ఎ.సూర్యనారాయణ పరిశీలించారు. చురుగ్గా రిజిస్ట్రేషన్‌లు చేసి లబ్ధిదారులకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

జనరాజ్ దాస్ సేవలు చిరస్మరణీయం



జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక గ్రామాభివృద్ధికి ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ పెంటకోట జగనాజ్‌దాస్ కృషి మరువలేనిదని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. మునగపాకలోని గ్రామీణ యువజన మందిరం ఆవరణలో స్వర్గీయ జనరాజ్‌దాస్ జయంతి సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌ఈసీఎస్ చైర్మన్‌గా పనిచేసిన కాలంలో వినియోగదారులకు మెరుగైన సేవలందించారన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్, పీఏసీఎస్, ప్రభుత్వ ఆస్పత్రి వంటి అభివృద్ధి జనరాజ్‌దాస్ హయాంలోనే జరిగిందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టిక్కలి కొండలరావు, పెద్దలు పెంటకోట వెంకట్, ఎ.వి. సత్యనారాయణ, పెంటకోట ఆదినారాయణ, ఆడారి కాశీబాబు, సూరిశెట్టి శ్రీనివాసరావు, మళ్ల రామజోగినాయుడు, మళ్ల జగ్గప్పారావు, సత్యనారాయణ, వేగి కృష్ణ, మళ్ల కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, కె.వి.ఎస్ అప్పారావు పాల్గొన్నారు.

నేడు జువ్వాలమ్మ పండగ

మునగపాక : గంటవానిపాలెం గ్రామంలో మంగళవారం జువ్వాలమ్మ తల్లి పండగ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. పండగలో భాగంగా గ్రామంలో రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రజలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరారు.

నాసా సహకారంతో చేతిబోరు



రామచంద్రపురంలో చేతిబోరును ప్రారంభిస్తున్న వైజర్

కోటవురట్ల: పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నాసా స్వచ్ఛంద సంస్థ కృషి అభినందనీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి అన్నారు. రామచంద్రపురంలో నాసా స్వచ్ఛంద సంస్థ సహకారంతో చేతిబోరును వేసి సోమవారం ప్రారంభించారు. నాసా సంస్థ ప్రతినిధి వైజర్ చేతిబోరును ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలోని మిగతా గ్రామాలలో కూడా సదుపాయాల కల్పనకు సహకారం అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణ, నాసా సంస్థ ప్రతినిధులు వెంకటరత్నం, భీమరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి రమణకు సత్కారం



అరబుపాలెం పంచాయతీ కార్యదర్శి రమణను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : అంకితభావంతో పనిచేసే అధికారులకు తగిన గుర్తింపు ఉంటుందని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ పంచాయతీ అధికారిగా పురస్కారం పొందిన రమణను పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి రమణ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంబా అప్పారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎంపీడీవోలకు నాయకుల శుభాకాంక్షలు



ఎంఆర్ఓ ను అభినందిస్తున్న నాయకులు



ఎంపిడివో ను అభినందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : మండలంలో క్రొత్తగా ఉద్యోగ భాద్యతలు చేపట్టిన అధికారులను ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. మండల తహసీల్దార్‌గా జి.ఎ.సూర్యానారాయణ, ఎంపీడీవోగా కె.స్వప్న శనివారం బాధ్యతలు చేపట్టారు. వీరిని నాయకులు కలిసి సాలువాలు వేసి, పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, పన్నీరు బాబ్జి, వంగలపూడి రాము, పడాల దివాణం, పార్టీ బిసి కార్యదర్శి వై.అన్నవరం, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవవరపు వెంకటేశ్వరరావు వున్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



దిమిలిలో భగవద్గీత గ్రంథాన్ని అందజేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

రాంబిల్లి: దిమిలిలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆధ్యాత్మికత, హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, భగవద్గీత సారాంశాలపై అవగాహన కల్పించారు. పలువురు భక్తులకు భగవద్గీత గ్రంథాలను అందజేశారు. దేవాలయాలు, పండగలు విశిష్టతను , వేమన పద్యాల్లో నీతిని వివరించి మంచి క్రమశిక్షణ, అలవాట్లు అలవర్చుకోవాలని ప్రబోధ సేవా సమితి సభ్యులు సోమినాయుడు, శ్రీనివాస్, రమాదేవి, లక్ష్మి వివరించారు. అందరూ ఆధ్యాత్మికత వైపు దృష్టి సారించాలని కోరారు.

వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో పరిషత్ సభ్యులు

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత హైస్కూల్లో సోమవారం భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిబేట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు పలు పాఠశాలల నుంచి 39 మంది విద్యార్థులు హాజరయ్యారని పరిషత్ అధ్యక్షుడు ఎ.ఓంరాం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు- ప్రజల హక్కులు, బాధ్యతలు అనే అంశంపై పోటీలు నిర్వహించామన్నారు. వాసవీ బాలవిహార్ స్కూల్ నుంచి కె.అక్షయ ప్రథమస్థానం దక్కించుకోగా, విద్యాధరి స్కూల్ నుంచి కె.అమూల్య ద్వితీయస్థానం, అదే స్కూల్‌కు చెందిన పి.అశ్విని తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. విద్యాధరి స్కూల్‌కు చెందిన బి.చైతన్యకుమార్, బాలికోన్నత స్కూల్‌కు చెందిన కె.లక్ష్మిలకు కన్సొలేషన్ బహుమతులు దక్కినట్టు తెలిపారు. అంతకుముందు విజేతలైన విద్యార్థులకు పరిషత్ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు. కె.ఎల్.ఎస్.మూర్తి, కె.రమాదేవి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ కన్వీనర్ వై.కేశవరావు, కోకన్వీనర్ బి.వి.రాజు, సభ్యులు చదరం కోటేశ్వరరావు, ఎస్.ఎ.బి.వర్మ, కె.ఎల్.వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలల విలీన ప్రక్రియ వద్దు

అనకాపల్లి : పాఠశాలల విలీన ప్రక్రియను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ)జిల్లా అధ్యక్షుడు అచంట రవి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. 117 జీవోతో ప్రాథమిక పాఠశాలల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని, ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో పోస్టులు గణనీయంగా తగ్గిపోయాయన్నారు. ఈ కారణంగా 703 మంది ఎస్‌జీటీలను ఏజెన్సీకి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు.

ఏపీపీ సత్యనారాయణకు సత్కారం

అనకాపల్లి: స్థానిక న్యాయసముదాయంలో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా సేవలందిస్తున్న బి.వి.సత్యనారాయణను జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ న్యాయమూర్తి జి.గంగరాజు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 26న కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఏపీపీగా సత్యనారాయణ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్‌వీ.లక్ష్మణరావు(సాయి), ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థి మృతికి కారకులైన అధికారులపై చర్యలకు డిమాండ్

తుమ్మపాల : హాస్టల్ విద్యార్థి మృతికి కారకులైన విద్యుత్ శాఖ ఏఈ, నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యుఓ శ్యామల, హాస్టల్ సంక్షేమ అధికారిపై చర్యలు చేపట్టాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, వివిధ దళిత సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రత్యేకించి హాస్టల్లో పరిస్థితిపైన పర్యవేక్షణ లేకపోవడం సక్రమ రీతిలో ఏఎస్‌డబ్ల్యుఓలు పనిచేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నం ఎస్‌డబ్ల్యుఓ శ్యామల పలుసార్లు గొలుగొండ మండలం జోగంపేట ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కి వెళ్లినప్పటికి అక్కడ ఉన్న పరిస్థితులను గమనించడంలోను, భద్రత శానిటేషన్‌పై దృష్టి సారించకపోవడం వల్లనే విద్యార్థి విద్యుత్ షాక్‌కి గురై మరణించారన్నారు. వార్డెన్ అప్పారావు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌కు, నర్సీపట్నం ఎస్‌డబ్ల్యుఓ శ్యామలకు ఫిర్యాదు చేసినప్పటికి వారు స్పందించలేదన్నారు. వీరిద్దరి నిర్లక్ష్యంతోనే ఏడో తరగతి చదువుతున్న తూబిరి దావీదు రాజు విద్యుత్ షాక్‌కి గురై మరణించారని ఆరోపించారు. డీవీఎంసీ సభ్యులు బొడ్డెడ అప్పారావు, ప్రభుత్వ రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు మల్లారపు లోవచందు, మోన రమేష్ పాల్గొన్నారు.

'ఆయుష్మాన్' వెల్‌నెస్ సెంటర్ వైద్యాధికారిగా శిరీష



కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ వెల్‌నెస్ సెంటర్ వైద్యాధికారి టి.శిరీష

కశింకోట : కన్నూరుపాలెంలో ఉన్న ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్ వైద్యాధికారిగా టి.శిరీష నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఇన్‌ఛార్జిగా ఇప్పటి వరకు వ్యవహరించారు. కన్నూరుపాలెంలో ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి వైద్యాధికారిగా వ్యవహరించిన కె.లావణ్యను యథావిధిగా అనకాపల్లి ఆస్పత్రిలో నియమించారు.

'చేపల చెరువులతో పొలాలకు ముప్పు'



చినఉప్పలం రెవెన్యూ పరిధిలో చేపల చెరువులను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

ఎస్.రాయవరం : మండలంలో చినఉప్పలం, ఉప్పరాపల్లి గ్రామాల రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న రొయ్య, చేపల చెరువులతో పంటపొలాల్లో ఉప్పునీరు తగిలి తీవ్రంగా నష్ట పోతున్నారని రైతు సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకులు చెరువులను పరిశీలించారు. చెరువులు నిర్వహణ ద్వారా వచ్చే ఉప్పునీటి శాతం పెరిగి కర్రివానిపాలెం, పిట్లపాలెం, వెంకటాపురం గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో ఉప్పు శాతం పెరిగి చౌడు భూములుగా మారుతున్నాయన్నారు. గడిచిన 7 సంవత్సరాలుగా సిపి సంస్థ వారు నిర్వహిస్తున్న చెరువులు కారణంగా పంటలు పండడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ సమస్యపై అధికారులు పరిశీలించి నష్టపోతున్న రైతులను ఆదుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన చేపల చెరువుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువులు పరిశీలించిన వారిలో రైతు సంఘ నాయకులు ఎం.అప్పలరాజు, సత్యనారాయణ, ఎం.రాజేష్ , రైతులు ఉన్నారు.

అభయాంజనేయస్వామి వార్షికోత్సవాలకు ఏర్పాట్లు



అభయాంజనేయస్వామి వార్షికోత్సవం సందర్భంగా ఆకట్టుకుంటున్న విద్యుదలంకరణ



గోకులపాడులోని అభయాంజనేయ స్వామివారు

ఎస్.రాయవరం : గోకులపాడు గ్రామంలో అభయాంజనేయస్వామి వార్షికోత్సవం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామంలో మూడు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు కమిటీ వారు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి యువతీ యువకులకు క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇప్పటికే షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. రాత్రికి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం జాతరను పురస్కరించుకుని ఉదయం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాలు ఉంటాయి. ఈ సందర్భంగా చిన్నారులతో కోలాటం, నేలవేషాలు, తీర్థం ఉంటుందన్నారు. ఈ జాతరలో ప్రత్యేకంగా ఉత్తమ రైతులకు సన్మానం చేసి ప్రోత్సహించే కార్యక్రమం చేపడుతున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆకట్టుకునేలా విద్యుదలంకరణ చేశారు. రాత్రికి భారీగా బాణసంచా వెలిగించడంతో పాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ముమ్మరంగా వరి నూర్పులు



ధాన్యాన్ని బస్తాల్లో లోడు చేస్తున్న రైతులు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఖరీఫ్ వరి నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పలుచోట్ల యంత్రాలు సాయంతో వరి నూర్పిడి చేస్తున్నారు. నూర్పిడి యంత్రాలతో పాటు ట్రాక్టర్లను నూర్పిడి పనులకు వినియోగిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 4400 ఎకరాల్లో వరినాట్లు వేశారు. అయితే మిచాంగ్ తుపానుకు సుమారు 1700 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. పంట దెబ్బతిన్న బాధిత రైతులను అధికారులు గుర్తించి ప్రభుత్వానికి పరిహారం కోసం నివేదిక పంపారు. తుపానుకు దెబ్బతినకుండా వున్న పంటను కోతలు కోసి కుప్పలుగా పెట్టారు. ఇప్పుడు రైతులు ఈ కుప్పలను నూర్పుతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆర్‌జీఎల్ వరి రకాన్ని సాగు చేశారు. మరోపక్క వరి గడ్డికి మంచి డిమాండ్ ఏర్పడింది. ఎకరాలో పండిన గడ్డి రూ.6వేలు పలుకుతోంది. వ్యాపారులు గడ్డి కొనుగోలుకు ఉత్సాహం చూపుతున్నారు. రాంబిల్లి మండలం నుంచి ట్రాక్టర్లు, టాటా ఏస్ వాహనాల ద్వారా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు తరలిస్తున్నారు.

'సుమ'ధురం..ప్రకృతి సోయగం



పచ్చని పొలాలు, చెట్ల నడుమ కురుస్తున్న మంచు



కనువిందు చేస్తున్న జనుము పూల సోయగం

రాంబిల్లి : సాధారంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రకృతి సోయగాలు కనువిందు చేస్తుంటాయి. అయితే ఇప్పుడు మైదాన ప్రాంతాల్లోనూ ప్రకృతి కట్టిపడేస్తుంది. రాంబిల్లి మండలంలో పల్లెల్లో పచ్చని పంట పొలాలు , చెట్లు నడుమ తెల్లవారు ప్రారంభమైన మంచు ఉదయం 8 గంటల వరకు కురుస్తూ ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తుంది. మరోపక్క పలు పొలాలు, గట్లపై వేసిన జనుము ఏపుగా పెరిగి పూలతో ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి ప్రేమికులు తమ సెల్‌ఫోన్లలో జనుము పూలు, మంచు సోయగాలను ఫొటోలు తీసుకుంటూ సంబరపడుతున్నారు.

కల్యాణికి ఏయూ డాక్టరేట్



కల్యాణికి పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

యలమంచిలి రూరల్ : స్థిరమైన పట్టణ నీటి నిర్వహణ అంచనా, ఏకీకరణ భూతాపం ప్రభావం అనే అంశంపై పరిశోధన చేసిన యలమంచిలికి చెందిన కుంచాల కళ్యాణికి ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సోమవారం డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. భూ వినియోగానికి సంబంధించి రాబోయే వాతావరణ మార్పులు, ఆర్ లాంగ్వేజి సహాయంతో వర్షపాతం, భూ ఉపరితల ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గుల గురించి లోతైన పరిశోధన చేశారు కల్యాణి. 2012లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, 2014లో ఎంటెక్ పూర్తి చేసిన కళ్యాణి సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎండీ మునిరెడ్డి పర్యవేక్షణలో విజయవంతంగా ఈ పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు పరిశోధనా గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. కల్యాణి తండ్రి కె.వీరయ్య యలమంచిలి మున్సిపాలిటీలో డీఈఈగా పనిచేస్తున్నారు. కళ్యాణి డాక్టరేట్ డిగ్రీ పొందడం పట్ల మున్సిపల్ కమిషనర్ కొండలరావు, పలువురు అధికారులు, స్నేహితులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

అనకాపల్లి : భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని స్థానిక న్యాయస్థానాల వద్ద 44వ రోజు సోమవారం న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయిలక్ష్మణ్ మాట్లాడుతూ ఏపీ భూహక్కుల యాజమాన్య చట్టం 2022నకు వ్యతిరేకంగా దీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుకోవాలని ఆయన కోరారు. దీక్షలో న్యాయవాదులు మళ్ల నూకరాజు, విజయ ఆనంద్, ఆర్.రమణ, ఆర్.శేఖర్, బి.లోవరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.